# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

MARCH - 2002

# సంక్షిప్త వార్తలు

2002 ఫిబ్రవరి 13 నుండి 17 వరకు పశ్చిమగోదావరి జిల్లా జంగారెడ్డి గూడెం స్థానిక క్రీస్తుసంఘము గొప్ప సువార్తసభలను నిర్వహించిరి. ఆ సభలలో "సత్యదేవుని ఎరుగుటయే నిత్యజీవము" అను అంశముపై ఆధారపడి వాక్యోపదేశము గావించ బడెను. సహోదరులు బి.జాషువా (ఏలూరు), బి.జీవన్ (విజయవాడ), జాషువా గూటం (కాకినాడ), చుక్కా జేకబ్ (బెంగుళూరు) మరియు వెయిన్ డేవిస్ (అమెరికా) గార్లు వాక్యపరిచర్య చేసిరి. కూటములకు వందలాది ప్రజలు హాజరైరి. ప్రతిరోజు ఉదయం బైబిలు తరగతి నిర్వహించ బడెను. జంగారెడ్డిగూడెం క్రీస్తుసంఘము విస్తృత ఏర్పాట్లు చేసి సువార్త కూటములను జయకరముగా నడిపించిరి.

ఫిబ్రవరి 17వ తేదీ ఆదివారం మధ్యాహ్నం ముమ్మిడివరం మండలం గుత్తినదీవిలో నిర్మించబడిన క్రీస్తుసంఘ నూతన ఆలయప్రవేశము జరిగెను. హర్షల్ గారు వాక్యపరిచర్య చేసిరి. ఇద్దరు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. గుత్తిన దీవిలోను, గోగుల్లంకలోను సోదరులు యు.స్టాలిన్ గారు సువార్త చాటుచున్నారు.

ఫిబ్రవరి 18వ తేదీ మధ్యాహ్నం పిఠాపురం ఇందిరాకోలనీలో యున్న క్రీస్తుసంఘములో హర్షల్ గారును, జాషువా గూటం గారును వాక్యపరిచర్య చేయగా 5గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. ఇందిరా కోలనీలో సోదరులు వి. యేసు రత్నం గారు సువార్త చాటుచున్నారు.

ఫిబ్రవరి 20,21,22 తేదీలలో రామచంద్రాపురం మండల ఓదూరు గ్రామములో గొప్ప సువార్తకూటములు ఏర్పాటు చేయబడెను. ఆ కూటములలో సోదరులు పి. జాన్‌మోజెస్ (ఇంద్రపాలెం), పి.యన్.ఆర్. జయపాల్ (ర్యాలి), జాషువాగూటం (కాకినాడ) మరియు పి.డి. బిషప్ (మోడేకుర్రు) గార్లు వాక్యపరిచర్య చేసిరి. కూటముల అనంతరం 4గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. అగ్రహారంలోను, ఓదూరులోను సోదరులు పులగల సుందర్రావ్ గారు గొప్ప కృషిచేసి మంచి సంఘములను నెలకొల్పి క్రీస్తుపనిని జరిగించుచున్నారు.

ఫిబ్రవరి 22వ తేదీ శుక్రవారం అమలాపురం కరక్కాయపేట క్రీస్తు సంఘ ఆవరణలో సువార్తికుల సహవాసకూడిక జరిగెను. "దేవత్వము యొక్క సర్వపరిపూర్ణత శరీరముగా క్రీస్తునందు నివసించుచున్నది" (కొలస్స 2:9) యను అంశము సవిస్తరముగా ఆనాడు ధ్యానించబడెను. సోదరులు యస్. జాన్ (రాజమండ్రి), జాషువా గూటం (కాకినాడ), పి.డి. బిషప్ మరియు పి.యస్.ఆర్. జైపాల్ (ర్యాలి) గార్లు పై అంశముపై వాక్యోపదేశము గావించిరి. యేసుక్రీస్తు దేవుడు, దైవసమానుడు ఆయన వాక్యమైన దేవుడు, శరీరధారియై మానవునిగా ఈ లోకమునకవతరించి దేవుని యొక్క తత్వమును, లక్షణములను, ప్రత్యక్షముగా ప్రజలకు బయలు పరచెను. ఆయన చేసిన అద్భుతములు ఆయనే సర్వశక్తి మంతుడని, సర్వజ్ఞానియని, సర్వాంతర్యామియని సూచించుచున్నవి. మానవుడు

# సత్యవాక్కు
## THE WORD OF TRUTH
**P.O. Box 80, Kakinada, A.P. 533 001**
**Phone : 0884 - 363722**
**Editor :**

JOSHUA GOOTAM

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 22 మార్చి 2002 సంచిక 8


# యేసుక్రీస్తు దేవుని కుమారుడు - 4
## (Jesus Christ, the son of God - 4)

యేసుక్రీస్తు దేవుని కుమారుడని క్రైస్తవులు ఎందుకు నమ్ముదురో గత కొన్ని సంచికలలో తెలిసికొనియున్నాము. సత్యవాక్కును చదివి యేసుక్రీస్తు నందు విశ్వాసాన్ని వెల్లడి పర్చుచూ అనేకులు మాకు వ్రాసారు. వారికి మా హృదయపూర్వక వందనములు. ఇంతవరకు యేసును గూర్చి మనము నేర్చుకొనిన కొన్ని సత్యాలను ఇప్పుడు మనము జ్ఞప్తికి తెచ్చుకొందాము.

యేసు కన్యయైన ఒక స్త్రీకి దేవుని వలన జన్మించెను. అందువలన ఆయన జన్మించిన రీతిని బట్టి దేవుని అద్వితీయ కుమారుడాయెను. ఆయనే దేవుని

కుమారుడు అని యేసును ఎరిగిన అనేకులు ఇచ్చిన సాక్ష్యమును బట్టి మనము ఆయన యందు విశ్వాసముంచగలము. అంతేకాదు, యేసుక్రీస్తు యొక్క, జనన, జీవన, మరణ పునరుత్థానములను గూర్చి వందలకొలది సం॥లకు ముందే చెప్పబడిన ప్రవచనము లనేకములు యేసుక్రీస్తులో అక్షరాల నెరవేరెను. గనుక ఆయనే దేవుని కుమారుడు, ఆయనే దేవుడు అని మనము ఒప్పుకొనక తప్పదు.

## ఆయన చేసిన అద్భుతములు

యేసు దేవుని యొక్క ఏకైక కుమారుడని మనము నమ్ము నిమిత్తము మనకు ఇంకొక ఆధారమున్నది. ఆయన ఈ లోకములో చేసిన అద్భుతములే. అయితే ఆ యద్భుతములలో కొన్నింటిని ఈ రోజు మనము పరిశీలించుదాము. భూమిపై ఏ మానవుడు ఎన్నడు చేయలేని అద్భుత కార్యములను యేసు చేసెను. ఆయన చేసిన అద్భుత కార్యములను చూచిన జనసమూహములు ఆయనే దేవుని కుమారుడని ఒప్పుకొనక తప్పలేదు. ఆయన దేవుని కుమారుడు కానియెడల అట్టి మహత్కార్యములనెట్లు చేయగలడు? మత్తయి, మార్కు, లూకా, యోహాను అనువారు యేసు చేసిన అద్భుత కార్యములలో కొన్నింటిని క్రొత్తనిబంధన గ్రంథములో మనకు వ్రాసియిచ్చారు. వారు వ్రాసిన సాక్ష్యమును మనము చదువుచుండగా యేసు చేసిన మహత్కార్యములు, సూచక క్రియలు ఆయనే దేవుని కుమారుడని సూచించుచున్నవి. ఆయన చేసిన అద్భుతములలో 41ని గూర్చి క్రొత్తనిబంధన లోని మొదటి నాలుగు సువార్తలు మనకు తెలియ జెప్పుచున్నవి. అయితే "యేసు చేసిన కార్యములు ఇంకను అనేకములు కలవు. వాటిలో ప్రతిదానిని వివరించి వ్రాసిన యెడల అట్లు వ్రాయబడిన గ్రంథములకు భూలోకమైనను చాలదని" భక్తుడైన యోహాను సాక్ష్యము పలికెను (యోహాను 21:25).

యేసుక్రీస్తు గ్రుడ్డివారికి చూపునిచ్చెను. కుంటివారికి నడువ శక్తినిచ్చెను. కుష్ఠరోగులను శుద్ధులనుగా చేసెను. చెవిటి వారికి వినుటకు శక్తినిచ్చెను. చనిపోయిన వారిని లేపదీసెను. మనుష్యులకున్న ప్రతివిధమైన రోగములను

మాట చెప్పి బాగుచేసెను. దయ్యములను వెళ్లగొట్టెను. నీళ్లమీద నడచెను. గాలిని తుఫానును ఆయన గద్దించగా అవి నిమ్మళమాయెను. వేలకొలది ప్రజలకు ఆయన అద్భుతరీతిగా ఆహారమునిచ్చెను. ఆయన చనిపోయి సమాధి చేయబడినను మృత్యువును తనకు తానే గెలిచి లేచెను. అందువలన ఆయన దేవుని కుమారుడని మహిమా ప్రభావముతో నిరూపింపబడెను (రోమా 1:4).

గలిలయలోని కానా యను ఊరిలో ఒక వివాహము జరిగెను. యేసు తల్లి అక్కడ ఉండెను; యేసును, ఆయన శిష్యులును ఆ వివాహమునకు పిలువబడిరి. ఆ వివాహమందు నీళ్లను ద్రాక్షారసముగా మార్చి యేసు తన మహిమను బయలుపరచెను. యేసు చేసిన సూచకక్రియలలో ఇది మొదటిది; అందువలన ఆయన శిష్యులు ఆయన యందు విశ్వాసముంచిరి (యోహాను 2:1-11).

కపెర్నహూము అను ఊరిలో ఒక ప్రధాని కుమారుడు రోగియై యుండెను. యేసు గలిలయకు వచ్చెనని ఆ ప్రధాని విని ఆయన యొద్దకు వెళ్లి తన కుమారుడు చావ సిద్ధమై యుండెను గనుక ఆయన వచ్చి అతని స్వస్థపరచవలెనని వేడుకొనెను. యేసు నీవు వెళ్లుము. నీ కుమారుడు బ్రదికి యున్నాడని అతనితో చెప్పగా ఆ మనుష్యుడు యేసు తనతో చెప్పిన మాట నమ్మి వెళ్లిపోయెను. అతడింక వెళ్లుచుండగా అతని దాసులు ఎదురుగా వచ్చి అతని కుమారుడు బ్రతికియున్నాడని తెలియజెప్పిరి. నీ కుమారుడు బ్రతికి యున్నాడని యేసు తనతో చెప్పిన ఘడియయందే అది జరిగెనని అతడు కనుగొనెను గనుక అతడును అతని యింటి వారందరును యేసును నమ్మిరి (యోహాను 4:46-54).

ఒకసారి కుష్ఠరోగి ఒకడు వచ్చి యేసునకు మ్రొక్కి ..... ప్రభువా, నీ కిష్టమైతే నన్ను శుద్ధునిగా చేయగలవనెను. అందుకాయన చెయ్యిచాపి వానిని ముట్టి, నాకిష్టమే, నీవు శుద్ధుడవుకమ్ము అని చెప్పగా తక్షణమే వాని కుష్ఠరోగము శుద్ధియాయెను (మత్తయి 8:2-4). మరియొకసారి యేసు యెరూషలేమునకు ప్రయాణమై పోవుచుండగా పదిమంది కుష్ఠరోగులు ఆయనకు ఎదురుగా

వచ్చి దూరమును నిలిచి యేసుప్రభువా, మమ్ము కరుణించుమని కేకలు వేసిరి. ఆయన వారిని చూచి, మీరు వెళ్లి మిమ్మును యాజకులకు కనుపరచుకొనుడని వారితో చెప్పెను. వారు వెళ్ళుచుండగా శుద్ధులైరి. వారిలో ఒకడు స్వస్థత కలుగుట చూచి గొప్ప శబ్దముతో దేవుని మహిమ పరచుచు యేసు పాదముల యొద్ద సాగిలపడి ఆయనకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించెను (లూకా 17:11-19).

## మృతులను లేపెను

యేసు మార్గమున వెళ్ళుచుండగా పుట్టు గ్రుడ్డియైన ఒక మనుష్యుడు కనబడెను. యేసు నేలమీద ఉమ్మివేసి, ఉమ్మితో బురద చేసి, వాని కన్నుల మీద ఆ బురద పూసి, నీవు సిలోయము కోనేటికి వెళ్లి అందులో కడుగు కొనుమని చెప్పెను. వాడు వెళ్లి కడుగుకొని చూపుగలవాడై వచ్చెను. అతడు చూపు పొంది దేవుని మహిమ పరచెను. యేసు దేవుని యొద్ద నుండి వచ్చిన వాడని లోకమునకు నిర్భయముగా సాక్ష్యమిచ్చెను (యోహాను 9వ అధ్యా). యేసు యెరికో పట్టణము వెళ్లుచుండగా త్రోవ ప్రక్కన కూర్చున్న యిద్దరు గ్రుడ్డివారు ప్రభువా, దావీదు కుమారుడా, మమ్ము కరుణింపుమని కేకలు వేసిరి. కాబట్టి యేసు కనికరపడి వారి కన్నులు ముట్టెను; వెంటనే వారు దృష్టి పొంది ఆయన వెంట వెళ్లిరి (మత్త 20:29-34). ఒకసారి సమాజ మందిరపు అధికారి యాయీరను నతడు యేసునొద్దకు వచ్చి, నా కుమార్తె యిప్పుడే చనిపోయినది. అయినను నీవు వచ్చి నీ చెయ్యి ఆమె మీద ఉంచుము; ఆమె బ్రతుకుననెను. యేసు అతని యింటికి వెళ్లి ఆమె చెయ్యి పట్టుకొని చిన్నదానా, లెమ్మని చెప్పగానే ఆ చిన్నది లేచి నడవసాగెను. ఆమె 12 సం॥లు ప్రాయము గలది. ఇది చూచి జనసమూహములు బహుగా విస్మయమొందిరి (మత్త 9:18-19, 23-26; మార్కు 4:21-24, 35-42). యేసు నాయీనను ఒక ఊరికి వెళ్లుచుండగా, ఆ ఊరి గవిని యొద్దకు వచ్చినప్పుడు చనిపోయిన యొకడు వెలుపలికి మోసికొని పోబడుచుండెను. ఆయన ఆ శవమును నిలిపి చిన్నవాడా లెమ్మని నీతో చెప్పుచున్నాననగా ఆ చనిపోయినవాడు లేచి కూర్చుండి మాటలాడ

సాగెను. ఇది చూచి అందరు భయాక్రాంతులై దేవుడు తన ప్రజలకు దర్శన మనుగ్రహించి యున్నాడని దేవుని మహిమపరచిరి (లూకా 7:11-16). యేసు మిత్రుడగు లాజరు అనునతడు బేతనియ యను గ్రామములో చనిపోయెను. అతడదివరకే నాలుగు దినములు సమాధిలో యుండెనని యేసు ఎరిగినను యేసు అతని సమాధిపైనున్న రాయిని పొర్లింపజేసి, లాజరూ, బయటికి రమ్మని బిగ్గరగా చెప్పెను. వెంటనే చనిపోయిన లాజరు కాళ్ళు, చేతులు ప్రేత వస్త్రములతో కట్టబడిన వాడై వెలుపలికి వచ్చెను. ఆయన చేసిన ఈ మహత్కార్యమును చూచిన యూదు లలో అనేకులు ఆయనయందు విశ్వాసముంచిరి (యోహా 11:1-46).

## సముద్రమును గద్దించెను

యేసు తన శిష్యులతో కలిసి ఒక దోనెలో ప్రయాణము చేయుచుండెను. ఆయన నిద్రించుచుండగా సముద్రము మీద తుఫాను లేచినందున, ప్రభువా నశించి పోవుచున్నాము. మమ్మును రక్షించుమని చెప్పి శిష్యులు ఆయనను లేపిరి. ఆయన లేచి గాలినీ, సముద్రమును గద్దింపగా మిక్కిలి నిమ్మళమాయెను. ఆ మనుష్యులు ఆశ్చర్యపడి - ఈయన యెట్టివాడో, ఈయనకు గాలియు సముద్రమును లోబడుచున్నవని చెప్పుకొనిరి (మత్త 8:23-27). యేసు ఒకసారి సముద్రము మీద నడచుచు తన శిష్యులు ప్రయాణము చేయుచున్న దోనె యొద్దకు వెళ్ళెను (మార్కు 6:48-56).

యేసు ఒకసారి అయిదు రొట్టెలు రెండు చేపలతో అయిదు వేలకంటె ఎక్కువమందికి సంతృప్తిగా ఆహారము పెట్టెను (మార్కు 6:36-44). మరియొక సారి యేడు రొట్టెలు, కొన్ని చిన్నచేపలతో ఆయన నాలుగు వేలమంది కంటె ఎక్కువ మందికి ఆహారము పెట్టెను (మార్కు 8:1-9).

యేసుక్రీస్తు చేసిన అనేక అద్భుతములను గూర్చి మనము చెప్పుకొన వలెనన్న మన జీవితమంతయును వెచ్చించినను సమయము చాలదు. యేసే

క్రీస్తని, ఆయనే దేవుని కుమారుడని మనము నమ్మునట్లు ఆయన ఈ అద్భుతకార్యములను ప్రజలయెదుట చేసెను. ఈనాడు మనము యేసునందు విశ్వాసముంచవలెనంటే అద్భుతములను చూడనవసరము లేదు. యేసు చేసిన అద్భుతములను గూర్చి మనము ఆయన గ్రంథమందు చదువుట వలనను, వాటిని గూర్చి వినుట వలనను మనము ఆయనయందు విశ్వాసముంచ వలెనని ఆయన కోరుచున్నాడు. అందుకే చూచి నమ్మినవారికంటె చూడక నమ్మినవారు ధన్యులని ఆయన చెప్పుచున్నారు (యోహాను 20:29). యేసు చేసిన అద్భుతములు, సూచకక్రియలు, మహాత్కార్యములన్నియును బైబిలునందు వ్రాయబడలేదు. అందులో కొన్ని మాత్రమే వ్రాయబడెను. అందుకే భక్తుడైన యోహాను ఇట్లనుచున్నాడు: "మరియు అనేకమైన యితర సూచక క్రియలను యేసు తన శిష్యులయెదుట చేసెను ... యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని మీరు నమ్మునట్లును, నమ్మి ఆయన నామమందు జీవము పొందునట్లును ఇవి వ్రాయబడెను" (యోహాను 20:30-31).

ప్రపంచ చరిత్రలో యేసులాంటి మానవుడెన్నడు ఉద్భవించలేదు. ఆయన సత్యమును పల్కెను. సత్యమునే జీవించెను. యేసు తప్పయెవడు కన్య గర్భమున బుట్టెను? దేవుని కుమారుడు తప్ప యెవడు ప్రవచనములను సంపూర్తిగ నెరవేర్చగలడు? దేవుడు తప్ప యెవడు రోగులను అద్భుత రీతిగ బాగుచేయగలడు? యెవడు చనిపోయిన శవములకు ప్రాణము తిరిగిపోయగలడు? ప్రకృతి కర్తయైన దేవునికి తప్ప ప్రకృతి ... సముద్రము, తుఫాను, నీరు మొదలగునవి మరి యెవనికి లోబడును? మాయ మంత్రములతో యేసు ఈ లోకమునకు రాలేదు గాని, ఆయన దేవుడై యుండి సర్వశక్తితో మనమధ్య ఉద్భవించెను. ప్రపంచ చరిత్రను, మానవుల అధోగతిని మార్చినవాడు యేసుక్రీస్తే. ఆయనే దైవ మానవుడు, మనవుల దేవుడు. నీవు ఆయన యందు విశ్వాసముంచి, నీ పాపముల విషయమై మారుమనస్సు నొంది, యేసే దేవుని కుమారుడని నీ నోటితో ఒప్పుకొనుచు, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిన యెడల

... ఆయనను బట్టియే నీవు రక్షింపబడుదువని జ్ఞాపకముంచుకొనుము. "కుమారుని యందు విశ్వాసముంచువాడే నిత్యజీవము గలవాడు; కుమారునికి విధేయుడు కానివాడు జీవము చూడడు గాని దేవుని ఉగ్రత వానిమీద నిలిచి యుండును" అని దైవవేదము ఈ రోజు కూడ నిన్ను హెచ్చరించుచున్నది (యోహాను 3:36). గనుక నీవు ఆలస్యము చేయవద్దు.

# దేవునికి ప్రీతికరమైన యాగము

## (Pleasing Sacrifice unto the Lord)

బైబిలు రికార్డును బట్టి కయీను హేబెలులు దేవునికి బలియర్పించిన వారిలో ప్రథములు. దేవుడు హేబెలు అర్పణను అంగీకరించి కయీను అర్పణను తిరస్కరించెను. పితరుల యుగములోను, మోషే యుగములోను జంతు బలులు అర్పించబడుచు యుండెవి. మానవ పాపపరిహారార్థము దేవుని గొర్రెపిల్ల యగు యేసుక్రీస్తు తన్నుతానే బలిగా అర్పించబడిన నాటినుండి పశుబలి యర్పణలు అంతమొందించబడెను. క్రైస్తవ యుగములో మనం వేరే విధమైన బలుల నర్పించాలని చెప్పబడింది. రోమాలో యున్న క్రైస్తవులు దేవునికి ఎవ్విధమైన బలియాగము చేయాలో పౌలు వారికిట్లు చెప్పాడు : "కాబట్టి సహోదరులారా, పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని వాత్సల్యమును బట్టి మిమ్మును బతిమాలు కొనుచున్నాను, ఇట్టిసేవ మీకు యుక్తమైనది" (రోమా 12:1). పవిత్రమైన జీవితమే దేవునికి త్యాగపూరితమైన యాగము, "కాబట్టి ఆయన ద్వారా మనము దేవునికి ఎల్లప్పుడు స్తుతియాగము చేయుదము, అనగా ఆయన నామమును

ఒప్పు కొనుచు జిహ్వాఫలము అర్పించుదము. ఉపకారధర్మము చేయ మరచి పోకుడి, అట్టి యాగములు దేవునికిష్టమైనవి" యని హెబ్రీ పత్రిక లేఖకుడు బోధించాడు (హెబ్రీ 13:15-16).

మరచిపోవడం మానవతత్వం. దేవుని కట్టడలను, ఆయన కృపను ఇశ్రాయేలీయులు మరువరాదని ప్రభువు వారిని పదేపదే హెచ్చరించెను. యెహోవా యొక్క బాహుబలము వలన ఇశ్రాయేలీయులు ఐగుప్తు నుండి విమోచించ బడినారని వారు గుర్తుంచుకొనునట్లు పస్కా పండుగను ఏడాది కొకమారు ఆచరించాలని ప్రభువు వారినాజ్ఞాపించెను. దేవుని ఏకైక కుమారుడైన యేసుక్రీస్తు యొక్క సిలువ యాగమును క్రైస్తవులు ప్రభురాత్రి భోజనం ద్వారా ప్రతి ఆదివారమున జ్ఞాపకముంచుకొనాలని ఆయన ఆజ్ఞాపించెను.

హేబెలు యొక్క అర్పణ దేవునికి ప్రీతికరమైనది గనుక ఆయన దాని నంగీకరించెను. అతడు మృతినొందియు ఆ విశ్వాసము ద్వారా నేడు మనతో మాటలాడుచున్నాడు (హెబ్రీ 11:3). దేవునికి ప్రీతికరమైన యాగమును' గూర్చి చెప్పుచున్నాడు. మన యాజమానిని వెంబడించిన యెడల మన జీవితం, యాగం ప్రభువుకు ప్రీతికరముగా యుండును. అన్యజనులముందు పేతురు చేసిన మొదటి ప్రసంగములో, యేసుక్రీస్తు అందరికి ప్రభువు. దేవుడు నజరేయుడైన యేసును పరిశుద్ధాత్మతోను శక్తితోను అభిషేకించెను. ఆయన మేలుచేయుచు, స్వస్థపరచుచు సంచరించు చుండెనని బోధించెను (అపొ.కా. 10:36-37). మన జీవితంలో ప్రతి విషయములోను యేసుక్రీస్తును అను కరించాలని దేవుడు కోరుచున్నారు.

## ఉపకారం చేయాలి

తీర్పుదినమున నీతిమంతులను దేవుడు తన నిత్యరాజ్యములోనికి ఆహ్వానించును. ఏలయనగా వారు తమ పొరుగువారికి మేలు చేసియుండిరి,

"అప్పుడాయన యెడమవైపున ఉండు వారిని చూచి - శపింపబడిన వారలారా, నన్నువిడిచి అపవాదికిని వాని దూతలకును సిద్ధ పరచబడిన నిత్యాగ్నిలోనికి పోవుడి. నేను ఆకలిగొంటిని మీరు నాకు భోజనము పెట్టలేదు; పరదేశినై యుంటిని మీరు నన్ను చేర్చుకొనలేదు; దిగంబరినై యుంటిని మీరు నాకు బట్టలియ్యలేదు; రోగినై చెరసాలలో ఉంటిని మీరు నన్ను చూడరాలేదని చెప్పెను. అందుకు వారు ప్రభువా, మేమెప్పుడు నీవు ఆకలిగొని యుండుటయైనను, దప్పిగొని యుండుటయైనను, పరదేశివై యుండుటయైనను, దిగంబరివై యుండుట యైనను, రోగివై యుండుటయైనను, చెరసాలలో యుండుట యైనను చూచి నీకు ఉపచారము చేయలేకపోతిమని ఆయనను అడిగెదరు. అందుకాయన మిక్కిలి అల్పులైన వీరిలో ఒకనికైనను మీరు ఈలాగు చేయలేదు గనుక నాకు చేయలేదని మీతో నిశ్చయముగా చెప్పుచున్నానని వారితో అనును. వీరు నిత్య శిక్షకును, నీతిమంతులు నిత్య జీవమునకును పోవుదురు" (మత్తయి 25:31-46). మనము ఉపకారధర్మము చేయుటలో, త్యాగము చేయుటలో మంచి సమరయుని అనుకరించాలని ప్రభువు వారు చెప్పెను (లూకా 10:25-37).

## కీడుకు ప్రతికీడు కూడదు

యేసుక్రీస్తు, స్తెఫను మొదలగు వారు తమ్మును హింసించువారి కొరకు ప్రార్థించారు. కుష్టరోగియైన నయమాను యింటిలో యున్న ఇశ్రాయేలు దేశపుచిన్నది అతడు ఆరోగము నుండి శుద్ధుడగునట్లు సరియైన చోటికి నడిపించెను (2 రాజులు 5 అధ్యా). ఆమె అతని యింటిలో బానిసగా పట్టబడినను, అతనికి మేలు చేసెను. అందుకే అపొ.పౌలు ఇట్లు చెప్పుచున్నాడు: "కీడుకు ప్రతికీడెవనికిని చేయవద్దు; మనుష్యులందరి దృష్టికి యోగ్యమైన వాటిని గూర్చి ఆలోచన కలిగి యుండుడి ... నీ శత్రువు ఆకలిగొని యుంటే అతనికి భోజనము పెట్టుము, దప్పిగొని యుంటే దాహమిమ్ము; ఆలాగు చేయుట వలన అతని తలమీద నిప్పులు కుప్పగా పోయుదువు. కీడు వలన జయింపబడక మేలు చేత కీడును జయించుము" (రోమా 12:17-21).

దొర్కా అను తబితా అను శిష్యురాలు "సత్‌క్రియలను ధర్మకార్యములను బహుగా చేసియుండెనని" ఆమెను గూర్చి చదువగలము (అపొ.కా. 9:36). దేవుని గ్రంథములో ఆమెకు ఎంతమంచి పేరో! ఆమె చనిపోగా పేతురు ప్రార్థన చేయుటకు వచ్చినప్పుడు "విధవరాండ్రందరు వచ్చి యేడ్చుచు దొర్కా తమతో కూడ ఉన్నప్పుడు కుట్టిన అంగీలును, వస్త్రములును చూపుచు అతని యెదుట నిలిచిరి", పేతురు ఆమె కొరకు ప్రార్థన చేయగా ఆమె సజీవురాలుగా తిరిగి లేచెను (అపొ.కా. 9:39-41).

"ఆశీర్వాదమునకు వారసులవుటకు మీరు పిలువబడితిరి గనుక కీడుకు ప్రతికీడైనను దూషణకు ప్రతి దూషణయైనను చేయక దీవించుడి" యని మనకు చెప్పబడినది. చెడ్డదాని పలుకకుండ మన నాలుకను, పెదవులను కాచుకోవాలి, కీడు నుండి తొలగి మేలు చేయాలి. సమాధానమును వెదకి దాని వెంటాడాలి. ఏలయనగా ప్రభువు కన్నులు నీతిమంతులు మీదను, ఆయన చెవులు వారి ప్రార్థనలవైపునను ఉన్నవి గాని ప్రభువు ముఖము కీడు చేయువారికి విరోధముగా ఉన్నది" (1 పేతురు 3:9-12).

కీడుకు ప్రతి కీడు చేసేవారున్నారు. ప్రభువు వారిని తప్పక శిక్షిస్తాడు. మేలు చేసే వారికే కీడు చేసే వారున్నారు. గాని "మేలుకు ప్రతిగా కీడు చేయువాని యింట నుండి కీడు తొలగిపోదు" అని దేవుని వాక్యం చెబుతున్నది (సామె 17:13). అయితే "కీడు చేయుట మాని మేలు చేయుము, అప్పుడు నీవునిత్యము నిలుచుదువు" (కీర్తన 37:27). మనము మేలు చేయుటలో విసుగక యుండిన యెడల నిత్యుడగు తండ్రి యొక్క నిత్య నివాసములో మనకు ప్రవేశము లభించును (2 థెస్స 3:13). మనము సత్‌క్రియల యందాసక్తి కలిగియుందము. అట్టివే దేవునికిష్టమైన బలులు. దేవునికి ప్రీతికరమైన బలుల నర్పించని యెడల వాటిని ఆయన అంగీకరింపరని హేబెలు మృతుడైనను ఇంకను మనకు బోధించుచున్నాడు.

-- కవితా గౌతం
కాకినాడ.

# ఇక్కడ నుండి నిత్యత్వానికి

## (From Here to Eternity)

1951 ఆగష్టు 24 నాడు అమెరికాలో యునైటెడ్ ఎయిర్‌లైన్స్ విమానమొకటి ఒక కొండకు గుద్దుకొని, వేయిముక్కలై అగ్నికి ఆహుతి అయ్యింది. దానిలో 50 మంది మరణించిరి. ఆ విమాన శిథిలాలలో "ఇక్కడ నుండి నిత్యాత్వానికి" అనే ఒక పుస్తకం దొరికెను. ఆ పుస్తకం పేరే ఆరోజు ఆ విమానంలో ప్రయాణం చేయుచున్న 50 మంది ఆత్మీయ జీవితాలను వర్ణించింది. ఇక్కడ నుండి నిత్యత్వానికి పోవుడంలో ఏమివున్నదో ఇప్పుడు తెలిసికొందాము.

మొదటిగా, ప్రతివాడు భువి నుండి నిత్యత్వానికి వెళ్లుచున్నాడు. "మరణమును చూడక బ్రదుకు నరుడెవడు?" అని కీర్తన 89:48లో వ్రాయబడియున్నది. "బ్రదికియుండువారు తాము చత్తురని ఎరుగుదురు" అని సొలొమోను చెప్పెను (ప్రసంగి 9:5). ఆదాము నందు అందరు మృతిబొందుదురు అని పౌలు చెప్పెను (1 కొరి 15:22). మనుష్యులొక్కసారే మృతిబొందవలెనని నిర్ణయింపబడ్డెను (హెబ్రీ 9:27). "మనమందరమును చనిపోదుము గదా, నేలకు ఒలికిన మీదట మరల ఎత్తలేని నీటివలె ఉన్నాము" అని 2 సమూయేలు 14:14 చెప్పుచున్నది.

అయితే ఎందుకు ? మానవులెందుకు చనిపోవాలి ? ఇక్కడ నుండి నిత్యత్వానికి మనం ఎందుకు వెళ్లాలి? పౌలు యిట్లు వ్రాసాడు : "ఇట్లుండగా ఒక మనుష్యుని ద్వారా పాపమును పాపము ద్వారా మరణమును లోకములో ఎట్లు ప్రవేశించెనో, అలాగుననే మనుష్యులందరు పాపము చేసినందున మరణము అందరికినీ సంప్రాప్తమాయెను" (రోమా 5:12). మంచిచెడ్డల తెలివినిచ్చు వృక్షఫలమును తినరాదని దేవుడు ఆదాము హవ్వలకు ఆజ్ఞయిచ్చెను. దాని తిను దినమున మీరు నిశ్చయముగా చచ్చెదరని ఆయన వారికి చెప్పెను

(అది.కా. 2:17). వారు తిన్నారు. చనిపోవుట మొదటుపెట్టారు. వారు చనిపోయారు, మనము కూడా చనిపోతాము. "ఏలయనగా అందరును పాపము చేసి దేవుడను గ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు" (రోమా 3:23). "పాపము వలన వచ్చు జీతము మరణము" (రోమా 6:23). "పాపము చేయువాడే మరణము నొందును" (యెహెజ్కే 18:20).

రెండవదిగా ఇక్కడ నుండి నిత్యత్వానికి వెళ్లేటప్పుడు మనం వెళ్లగలిగే రెండే రెండు ప్రదేశాలున్నాయి. సరిగదా వాటిలో ఏదో ఒక్కటి మన నిత్యస్థానం అగును. "వీరు నిత్య శిక్షకును నీతిమంతుతు నిత్యజీవమునకును పోవుదురు" అని యేసు చెప్పెను (మత్త 25:46). గనుక మానవులందరు పరలోకానికి గాని, లేదా నరకానికి గాని వెళ్లుదురు.

దుష్టులు నరకానికి పోవుదురని దేవుని వాక్యము విశదపరచుచున్నది. "దుష్టులును దేవుని మరచు జనులందరును పాతాళమునకు దిగిపోవుదురని" కీర్తన 9:17లో వ్రాయబడియున్నది. అవిశ్వాసులైన పాపులు మరణించినప్పుడు యేసుతో ఉండుటకు వెళ్లరు (యోహాను 8:21,24). దేవుని నెరుగనివారు, మన ప్రభువైన యేసు సువార్తకు లోబడనివారు ఆయన సముఖమునుండియు, ఆయన ప్రభావమందలి మహిమ నుండియు పారదోలబడి నిత్య నాశనమను దండన పొందుదురు (2 థెస్స 1:7-10). యిట్టి దండన పొందినవారు పరిశుద్ధదూతల యెదుటను, గొర్రెపిల్ల యెదుటను అగ్ని గంధకముల చేత బాధింపబడుదురు. వారి బాధ సంబంధమైన పొగ యుగయుగములు లేచును. వారు రాత్రింబగళ్లు నెమ్మది లేనివారైయుందురు (ప్రక 14:10-11).

ఇట్లుండగా, రక్షింపబడిన వారు పరలోకమునకు వెళ్లుదురు. తండ్రియైన దేవుని యందు, కుమారుడైన క్రీస్తునందు విశ్వసించినవారు క్రీస్తు తమ కొరకు సిద్ధపరచిన నిత్యనివాసములలో నివసింతురు (యోహాను 14:1-3). "భూమి

మీద మన గుడారమైన యీ నివాసము శిథిలమైపోయినను, చేతి పనికాక దేవుని చేత కట్టబడినదియు నిత్యమైనదియునైన నివాసము పరలోకమందు మనకున్నదని యెరుగుదుము" (2 కొరి 5:1). లోకాంతమందు క్రైస్తవులు లేప బడుదురు. నాటికి సజీవులైయున్న విశ్వాసులతో ఏకముగా ఆకాశమండలములో ప్రభువు నెదుర్కొని సదాకాలము ప్రభువుతో యుందురు (1 థెస్స 4:17).

మూడవదిగా, యేసుతో ఇప్పుడు యేమి చేయుదుమో, అది ఇక్కడ నుండి నిత్యత్వంలో ఎక్కడికి వెళ్లుదుమో నిర్ణయించునని గమనించుదాం. "క్రీస్తనబడిన యేసును యేమి చేతునని?" పిలాతు అడిగాడు (మత్త 27:22). క్రీస్తుతో మనం సరియైనది చేస్తే నిత్యజీవం మనదవుతాది. ఆయన తనకు విధేయులైన వారందరికీ నిత్యరక్షణకు కారకుడయ్యారు (హెబ్రీ 5:8-10). మనం ఆత్మకొరకు విత్తిన యెడల నిత్యజీవాన్ని స్వాస్థ్యముగా పొందుదుము (గలతీ 6:7-8). క్రీస్తు ఒక్కడు మాత్రమే నిత్యజీవపు మాటలు గలవాడు (యోహా 6:68). మనం ఆయన మాటలు విని ఆయనకు లోబడిన యెడల ఆయనతో నిత్యము జీవించగలము (యోహాను 3:16, 3:36). "మీరు నన్ను ప్రేమించిన యెడల నా ఆజ్ఞలను గైకొందురని" యేసు చెప్పెను (యోహాను 14:15). "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మనివానికి శిక్ష విధింపబడునని" యేసు చెప్పెను (మార్కు 16:16).

క్రీస్తు మాటలు విని వాటికి లోబడనివాడు యిసుకమీద తన యిల్లు కట్టుకొను వానివలె నుండును. వాన, వరద, గాలి వచ్చి ఆ యింటిని నాశనం చేయును. క్రీస్తును నిరాకరించువారు నరకపు గోతిలో పడుదురు (మత్త 7:24-26). రక్షకుని దగ్గరకు రానివారు నిత్యము జీవించరు (యోహా 5:40). మనం క్రీస్తు నందు విశ్వసించక పోతే మన పాపములలోనే మరణింతుము (యోహా 8:24). పాపము పరిపక్వమై ఆత్మీయ మరణమును కొనితెచ్చును (యాకోబు 1:15; రోమా 8:9).

పేతురు యిట్లనెను : "తీర్పు దేవుని ఇంటియొద్ద ఆరంభమగు కాలము

వచ్చియున్నది; అది మన యొద్దనే ఆరంభమైతే దేవుని సువార్తకు అవిధేయులైన వారి గతి యేమవును?" (1 పేతురు 4:17). దీని జవాబు విదితమే. సువార్తకు లోబడనివారు నిత్యనాశనము నొందుదురు (2 థెస్స 1:7-9).

ఇంగ్లాండ్ దేశపు గొప్ప ప్రధానమంత్రి యగు విల్లియం గ్లేడ్‌స్టోన్ క్రైస్తవుడు. ఆయన దగ్గరకొక యౌవనస్థుడు వచ్చి, "అయ్యా నా భవిష్యత్తును గూర్చి నేను న్యాయశాస్త్రము చదువుటను గూర్చి మీకు చెప్పుటకు కొద్ది నిమిషముల సమయం ఇయ్యండి" అని అడిగాడు. ఆలాగే, చెప్పు అని ప్రధానమంత్రి అన్నారు. "అయ్యా నేను న్యాయశాస్త్రాన్ని చదివి ఇంగ్లాండు కోర్టులో ప్రవేశించాలనుకొను చున్నాను". "ఆలాగే, దాని తరువాత యేమిటి?". "అటు తరువాత అయ్యా పార్లమెంటులో ప్రవేశించాలను కొనుచున్నాను" "ఆలాగే, దాని తరువాత యేమిటి?", "అప్పుడు ఇంగ్లాండు కొరకు గొప్ప సంగతులు సాధించాలనుకొను చున్నానన్నాడా యౌవనస్థుడు". ఆలాగే, దాని తరువాత యేమి చేస్తావ్? అన్నారాయన, "దాని తరువాత నేను రిటైర్ అయినా విశ్రాంతి తీసికొంటాను" అన్నాడా యౌవనస్థుడు. ఆ తరువాత యేమిటి? అని ఆయన మరలా అడిగారు. "దాని తరువాత అయ్యా బహుశా నేను చనిపోతాను" అన్నాడు యౌవనస్థుడు. "అవునయ్యా, దాని తరువాత యేమిటి?" అని ప్రధానమంత్రి అతన్ని అడిగారు. ఆ యౌవనస్థుడు కొంచెం సంశయించి "దాని తరువాత సంగతి నేనెన్నడు ఆలోచించలేదన్నాడు". అప్పుడు గ్లేడ్‌స్టోన్ గారు అతనివైపు తీవ్రముగా చూచి, "యౌవనుడా నీవు చాల అవివేకివి. యింటికి పోయి నీ జీవితాన్ని గూర్చి బాగా ఆలోచించుకో " అని అతనికి సలహా నిచ్చారు. ఈ యౌవనుడు నిత్యజీవాన్ని గూర్చి ఎన్నడు ఆలోచించనే లేదు !

— జాన్ స్టో.

# బాప్తిస్మము
## (Baptism)

బాప్తిస్మము అనగా "ముంచుట" అని అర్థము. రక్షింపబడుట కొరకు బాప్తిస్మము పొందవలెనని క్రీస్తు ప్రభువు ఆజ్ఞాపించెను (మార్కు 16:16). క్రీస్తు సువార్తలో బాప్తిస్మము అంతర్భాగమని లేఖనములు తెలియజేయుచున్నవి.

ఫిలిప్పు క్రీస్తును గూర్చిన సువార్త ప్రకటించగానే ఐతియొపీయుడు "నాకు బాప్తిస్మమిచ్చుటకు ఆటంకమేమని" అడిగి క్రీస్తు సువార్తకు విధేయుడయ్యెను. విశ్వాసమును గూర్చి, మారుమనస్సును గూర్చి, హృదయమందలి విశ్వాసమును మనుష్యుల యెదుట ఒప్పుకొనుటను గూర్చి, బాప్తిస్మమును గూర్చి ఫిలిప్పు అతనికి బోధించెననునది నిర్వివాదాంశము. "అతడు బాప్తిస్మము పొంది సంతోషించుచు తన త్రోవను వెళ్లెను" (అపొ. కా. 8:39).

క్రీస్తు సంఘస్థులు బాప్తిస్మమును గూర్చి ఎక్కువగా బోధించుదురని కొందరి అభిప్రాయము. మేము బాప్తిస్మమును గూర్చి ఎక్కువగా బోధించుట నిజమే. ఎందుకంటే క్రొత్తనిబంధన బాప్తిస్మమును గూర్చి ఎక్కువగా బోధించుచున్నది.

బాప్తిస్మము పొందగోరు వ్యక్తికి వెంటనే బాప్తిస్మము ఇవ్వకూడదని, అతనిని అనేక దినాలు పరీక్షించాలని కొందరి అభిప్రాయము.

చెరసాల అధిపతి క్రీస్తు సువార్తను వినిన వెంటనే, ఆ రాత్రి బాప్తిస్మము పొందెను (అ.కా. 16:32-33). గారడీవాడైన "సీమోను కూడ నమ్మి ఫిలిప్పును ఎడబాయకుండి సూచక క్రియలును గొప్ప అద్భుతములును జరుగుట చూచి విభ్రాంతి నొందెను" (అ.కా. 8:13). తరువాత పేతురు యోహానుల ఎదుట

ద్రవ్యము పెట్టి "నేనెవని మీద చేతులుంచుదునో వాడు పరిశుద్ధాత్మను పొందునట్లు ఈ అధికారము నాకియ్యుడని అడిగెను" (అ.కా. 8:19). ఈ మాట అతడు అడిగిన తరువాతనే అతని హృదయము దేవుని యెదుట సరియైనది కాదని వారు గ్రహించిరి.

హృదయములను పరిశోధించునది దేవుడే. "యెహోవా అను నేను హృదయమును పరిశోధించువాడను" (యిర్మీయా 17:10).

"బాప్తిస్మమొక్కటే" (ఎఫెసీ 4:5). వాక్యానుసారమైన బాప్తిస్మము ఒక్కటే. బాప్తిస్మము పాపక్షమాపణ నిమిత్తము, క్రీస్తు మరణ సమాధి పునరుత్థానములలో పాలుపొందుటకు మరియు రక్షింపబడుట కొరకు పొందవలెను. ఈ గురితో ఎవరైతే బాప్తిస్మము పొందలేదో వారు పొందినది వాక్యానుసారమైన బాప్తిస్మము కాదు.

"అపొల్లో కొరింధులో నున్నప్పుడు జరిగినదేమనగా, పౌలు పై ప్రదేశము లలో సంచరించి ఎఫెసునకు వచ్చి, కొందరు శిష్యులను చూచి - మీరు విశ్వసించి నప్పుడు పరిశుద్ధాత్మను పొందితిరా ? అని వారినడుగగా వారు పరిశుద్ధాత్మ డున్నాడన్న సంగతియే మేము వినలేదని చెప్పిరి. అప్పుడతడు మీరు దేనిని బట్టి బాప్తిస్మము పొందితిరని అడుగగా వారు - యోహాను బాప్తిస్మమును బట్టియే అని చెప్పిరి. అందుకు పౌలు - యోహాను తన వెనుక వచ్చువాని యందు, అనగా యేసు నందు విశ్వాసముంచవలెనని ప్రజలతో చెప్పుచు, మారుమనస్సు విషయమైన బాప్తిస్మమిచ్చెనని చెప్పెను. వారు ఆ మాట విని ప్రభువైన యేసు నామమున బాప్తిస్మము పొందిరి" (అ.కా. 19:1-5). ఇచ్చట వాక్యానుసారమైన బాప్తిస్మ మొక్కటే ఉన్నది.

పేతురు "యేసుక్రీస్తు నామమందు వారు బాప్తిస్మము పొందవలెనని ఆజ్ఞాపించెను" (అ.కా. 10:48). బాప్తిస్మము ఒక ఆజ్ఞ.

దేవుని వాక్యమును విని (రోమా 10:7) విశ్వసించి (హెబ్రీ 11:6) మారుమనస్సు పొంది (అపొ.కా. 17:30) క్రీస్తు దేవుని కుమారుడని మనుష్యుల యెదుట ఒప్పుకొని (మత్త 10:32) వాక్యానుసారమైన ఒకే బాప్తిస్మమును పొందుము. మరణము వరకు నమ్మకముగా నుండుము. ఆయన నీకు జీవకిరీటమిచ్చును (ప్రక 2:10).

— ఇ.కె.వి. ప్రసాదరావు
చెయ్యేరు.

# సాటిలేని యేసు మాటలు

## (Matchless words of Jesus)

యేసు అద్భుతకార్యములు, సూచక క్రియలు చేయుచు బహిరంగముగా ప్రజలకు దేవుని గూర్చి బోధించుచుండగా యూదుల ప్రధాన యాజకులును, పరిసయ్యులును ఒకనాడు ఆయనను పట్టుకొనుటకు బంట్రోతులను పంపిరి. ఆ బంట్రోతులు వచ్చి యేసు జీవజలములను గూర్చి బోధించుట వినిరి. యేసు ఇట్లు బోధించెను: "ఎవడైనను దప్పిగొనిన యెడల నా యొద్దకు వచ్చి దప్పి తీర్చుకొనవలెను. నాయందు విశ్వాసముంచువాడెవడో లేఖనము చెప్పినట్టు వాని కడుపులో నుండి జీవజల నదులు పారును" (యోహాను 7:37,38). "ఆ బంట్రోతులు ప్రధాన యాజకుల యొద్దకును పరిసయ్యుల యొద్దకును వచ్చినప్పుడు వారు - ఎందుకు మీరాయనను తీసికొనిరాలేదని అడుగగా, ఆ బంట్రోతులు - ఆ మనుష్యుడు మాటలాడినట్లు ఎవడును ఎన్నడును మాటలాడ లేదనిరి" (యోహా 7:45,46). అవును, యేసు బోధించిన విధముగ బోధించిన

వాడు ఆయనకు ముందుగాని, ఆయన వెనుక గాని ఎన్నడు ఉద్భవింపలేదు. యేసు బోధలో యున్న ప్రత్యేకతను ఈ రోజు మనము కొంత గమనింతము.

## అధికార యుక్తమైన మాటలు

యేసుక్రీస్తు బోధించినపుడు అధికారము గలవానిగా బోధించెను. మున్నెన్నడు ఏ మనుష్యుడు అట్టి అధికారముతో బోధింపనేలేదు. కొండమీద ఆయన చేసిన ప్రసంగములో "ధర్మశాస్త్రము నైనను, ప్రవక్తల వచనములనైనను కొట్టివేయ వచ్చితినని తలంచవద్దు; నెరవేర్చుటకే గాని కొట్టి వేయుటకు నేను రాలేదు" అని ఆయన బోధించెను (మత్త 5:17). తరువాత ఒకడు నీతి మంతునిగా తీర్చబడవలెనన్న ధర్మశాస్త్రము కంటె మిన్నయైన ఆయన ఆజ్ఞలకు లోబడ వలెనని యేసు బోధించెను. ధర్మశాస్త్రములోని కొన్ని ఆజ్ఞల నెత్తి చూపించి, నీతిమంతునిగా తీర్చబడగోరువాడు వాటికంటె ఎక్కువ చేయవలెనని ఆయన బోధించెను. వాటిలో కొన్నిటిని ఇప్పుడు మనము చూచుకొందము :

"నరహత్య చేయవద్దు; నరహత్య చేయువాడు విమర్శకు లోనగునని పూర్వికులతో చెప్పబడిన మాట మీర విన్నారు గదా. నేను మీతో చెప్పునదేమనగా - తన సహోదరుని మీద కోపపడు ప్రతివాడు విమర్శకు లోనగును. తన సహోదరుని చూచి వ్యర్థుడా అని చెప్పువాడు మహాసభకు లోనగును; ద్రోహి అని చెప్పువాడు నరకాగ్నికి లోనగును" (మత్త 5:21-23). ధర్మశాస్త్ర ప్రకారము నరహత్య చేయువాడే విమర్శింపబడేవాడు గాని క్రీస్తు చట్టప్రకారమయితే తన హృదయములో తన సహోదరుని ద్వేషించువాడు నరకాగ్నికిలోనగును. మోషే ధర్మశాస్త్రము ఒకని బాహ్య ప్రవర్తననుబట్టి విమర్శించునట్టిదిగాని, క్రీస్తు చట్టమయితే ఒకని హృదయ తలంపులను (Motive) బట్టి విమర్శించునది. ఇందులో ఏది శ్రేష్ఠమైనది ?

"వ్యభిచారము చేయవద్దని చెప్పబడిన మాట మీరు విన్నారుగదా నేను

మీతో చెప్పునదేమనగా - ఒక స్త్రీని మోహపు చూపుతో చూచు ప్రతివాడు అప్పుడే తన హృదయమందు ఆమెతో వ్యభిచారము చేసిన వాడగును" అని యేసుక్రీస్తు బోధించెను (మత్త 5:27). "తన భార్యను విడనాడు వాడు ఆమెకు పరిత్యాగ పత్రిక యియ్యవలెనని చెప్పబడి యున్నదికదా; నేను మీతో చెప్పున దేమనగా వ్యభిచార కారణమును బట్టిగాక, తన భార్యను విడనాడు ప్రతివాడును ఆమెను వ్యభిచారిణిగా చేయుచున్నాడు; విడనాడబడిన దానిని పెండ్లాడు వాడు వ్యభిచరించుచున్నాడు" (మత్తయి 5:31-32).

"మరియు - నీవు అప్రమాణము చేయక నీ ప్రమాణములను ప్రభువునకు చెల్లింపవలెనని పూర్వీకులతో చెప్పబడిన మాట మీరు విన్నారుగదా, నేను మీతో చెప్పునదేమనగా - ఎంత మాత్రము ఒట్టు పెట్టుకొనవద్దు .. మీ మాట అవునంటే అవును, కాదంటే కాదు అని యుండవలెను; వీటికి మించునది దుష్టుని నుండి పుట్టునది" (మత్తయి 5:33-37).

"కంటికి కన్ను, పంటికి పన్ను అని చెప్పబడిన మాట మీరు విన్నారుగదా, నేను మీతో చెప్పునదేమనగా దుష్టుని ఎదిరింపక నిన్ను కుడిచెంప మీద కొట్టువాని వైపునకు ఎడమ చెంప కూడ త్రిప్పుము. ఎవడైన నీమీద వ్యాజ్యము వేసి నీ అంగీ తీసికొన గోరిన యెడల వానికి నీపై వస్త్రము కూడ ఇచ్చివేయుము. ఒకడు మైలు దూరము రమ్మని బలవంతముచేసిన యెడల, వానితో కూడ రెండు మైళ్ళు వెళ్ళుము. నిన్ను అడుగువానికిమ్ము, నిన్ను అప్పు అడుగ గోరువాని నుండి నీ ముఖము త్రిప్పుకొనవద్దు" (మత్తయి 5:38-42).

"నీ పొరుగువాని ప్రేమించి, నీ శత్రువును ద్వేషించుమని చెప్పబడిన మాట మీరు విన్నారు గదా; నేను మీతో చెప్పునదేమనగా, మీరు పరలోకమందున్న మీ తండ్రికి కుమారులై యుండునట్లు మీ శత్రువులను ప్రేమించుడి. మిమ్మును హింసించు వారి కొరకు ప్రార్థన చేయుడి" యని యేసు అధికారముతో బోధించెను (మత్తయి 5:43,44).

యేసు ధర్మశాస్త్రము నుండి యెత్తి చూపించిన ఆరు సంగతులను ఇప్పటి వరకు మనము గమనించితిమి. ప్రతి సందర్భములోను యేసు ఆ సంగతిని చెప్పి, అది అట్లున్నట్టు మీరు విన్నారు గదా, అయితే నేను మీతో చెప్పునదేమనగా అని చెబుతు ధర్మశాస్త్రము విధించిన దానికంటే మరింత శ్రేష్ఠమైన విధులను క్రీస్తు బోధించెను. నేను చెప్పునదేమనగా యని ఆయన బోధించుటలో మోషే కంటె శ్రేష్ఠుడైన వాడని, ధర్మశాస్త్రమును మించిన యాజ్ఞలను ఆజ్ఞాపించు అధికారము గలవాడని క్రీస్తు నిరూపించుకొనెను. అందుకే "యేసు ఈ మాటలు చెప్పి ముగించినప్పుడు జన సమూహములు ఆయన బోధకు ఆశ్చర్యపడుచుండిరి. ఏలయనగా ఆయన వారి శాస్త్రులవలె కాక అధికారముగలవాని వలె వారికి బోధించెను" (మత్త 7:28,29).

## మృదువైన మాటలు

అంతేకాదు, యేసు పలికినంత మృదువుగా ఏ మానవుడు ఎన్నడు పలుకలేదు. ఆయన ఇట్లనుచున్నాడు; "ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి; నేను మీకు విశ్రాంతి కలుగజేతును. నేను సాత్వికుడను, దీన మనస్సు గలవాడను గనుక మీమీద నాకాడిఎత్తికొని నాయొద్ద నేర్చుకొనుడి; అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరకును. ఏలయనగా నాకాడి సుళువుగాను, నా భారము తేలికగాను ఉన్నవి" (మత్త 11:28-30).

యేసు బోధించినంత ప్రేమతోను, కరుణతోను ఏ మానవుడు ఎన్నడు బోధించి యుండలేదు. "నేను మిమ్మును ప్రేమించిన ప్రకారము మీరొకని నొకడు ప్రేమించ వలెననుటయే నా ఆజ్ఞ. తన స్నేహితుల కొరకు ప్రాణము పెట్టువానికంటె ఎక్కువైన ప్రేమగల వాడెవడును లేడు. నేను మీకాజ్ఞాపించు వాటిని చేసిన యెడల మీరును నా స్నేహితులై యుందురు" (యోహాను 9:13-14). దేవుని ప్రేమను మానవులకు చాటుటకు యేసు ఈ లోకమునకు వచ్చెను. ఆ ప్రేమను ఆయన తన జీవితములో మున్నెన్నడు ఎవడు నిరూపించని రీతిగ నిరూపించెను.

# ఆదరణ కలిగించే మాటలు

యేసు బోధించిన రీతిగ నిరీక్షణ గలిగిన మాటలను ఏ మానవుడు ఎన్నడు బోధింపలేదు. "మీ హృదయమును కలవర పడనీయకుడి; దేవుని యందు విశ్వాసముంచుచున్నారు. నా యందును విశ్వాసముంచుడి. నా తండ్రి యింట అనేక నివాసములు కలవు, లేనియెడల నేను మీతో చెప్పుదును; మీకు స్థలము సిద్ధపరచ వెళ్ళుచున్నాను. నేను వెళ్ళి మీకు స్థలము సిద్ధపరచిన యెడల నేనుండు స్థలములో మీరును ఉండులాగున మరల వచ్చి నాయొద్ద నుండుటకు మిమ్మును తీసికొని పోవుదును" అని యేసు బోధించెను" (యోహాను 14:1-3). మరల, "పునరుత్థానమును జీవమును నేనే; నా యందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రదుకును; బ్రదికి నాయందు విశ్వాస ముంచు ప్రతివాడును ఎన్నటికిని చనిపోడు" అని సమాధి యనంతరము నిరీక్షణ మనము కలిగియుండునట్లు యేసు బోధించెను (యోహాను 11:25,26).

యేసు చేసిన వాగ్దానములను ఏ మానవుడు ఎన్నడు చేయలేదు. మార్కు 16:16లో, నమ్మి బాప్తిస్మము పొందిన వానికి ఆయన రక్షణను వాగ్దానము చేసెను. తన శిష్యులు సర్వజనులను శిష్యులనుగా చేయవలెను. వారికి సువార్త బోధించి తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు పరిశుద్ధాత్ముని యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు ఆయన ఆజ్ఞాపించిన సంగతులన్నియు వారు గైకొనవలెనని బోధించినపుడు ఆయన యుగసమాప్తి వరకు సదాకాలము వారితో ఉందునని వాగ్దానము చేసెను (మత్తయి 28:19-20).

మనకు పాప క్షమాపణను, రక్షణను దయ చేయువాడు యేసుక్రీస్తే. ఆయన గొప్ప రక్షకుడు. ఆయన తప్ప మనుష్యులను తమ పాపముల నుండి విడిపించువాడు మరొకడు లేడు. నీవు యేసుక్రీస్తు నందు విశ్వాసివా ? అయితే

సాటిలేని యేసు మాటలను బట్టి నీ పాపముల విషయమై మారుమనస్సు నొంది ఈనాడే క్రీస్తులోనికి బాప్తిస్మము పొందుము !!

— జోషువా గూటం.

# పాపము
## (Sin)

అన్నిటికంటే పాపము బహుచెడ్డది. సరియగు రీతిలో పాపమును వివరించు సామర్థ్యమును కలిగి యుండవలెనని ఒక బోధకునిగా నా యొక్క కోరికయై యున్నది. కొందరు తలంచుచున్నట్లుగా సాతాను పడిపోయిన దేవదూతయై యుండవచ్చు (1తిమో 3:16). అట్లయిన పాపము సాతాను కంటె బహుచెడ్డది. ఎందుకనగా పాపమే వానిని సాతానుగా చేసినది. పాపము అను అంశముపై బైబిలు గ్రంథము వ్రాయబడినది. ఒకవేళ ఎవరైన "బైబిలు రక్షణ సంకల్పము" అను అంశము పై వ్రాయబడినదని తలంచుచున్నాను అని చెప్పినట్లయిన, "దేని నుండి రక్షణ (విడుదల) ?" అని నేను అడిగెదను. పాపము నుండి విడుదల (రక్షణ) అని జవాబు వచ్చును.

పాపము అనునది వాస్తవమైనది. దాని యొక్క వాస్తవికతను బైబిలు గ్రంథకర్తలెవరును సంశయింపరు. పాపము వాస్తవమైనదని యేసుక్రీస్తు తత్వ సంబంధమైన వాదములచేత నిరూపించుటకు ప్రయత్నించలేదు. ఆయన దైవ సంబంధమైన అహేతుకమైన వ్యక్తి. ఆయన మనుష్యులతో మీరు పాపులు అని చెప్పెను. కాని దానిని గూర్చి ఏవిధమైన వాగ్వివాదములు చేయలేదు

(యోహాను 8:7,21,24,44). యేసు పాపులని పిలచినవారు మత సంబంధమైన ప్రజలు. తమమతములో దేవునిపై తిరుగుబాటు చేయునట్లుగా చేయు కార్యములు పాపమని దేవుని వాక్యము బయలు పరచుచున్నది. నిజాయితీ, మనస్సాక్షి మరియు నమ్మకము అనునవి ఇకను పాపమును చేయనీయవు. బహుషా దేవుని దృష్టిలో నిజమైన పాపమేమనగా తమ ఆచారములను నమ్మకములను దేవుని యొక్క వాక్యముద్వారా మానవుల కీయబడిన ఆజ్ఞల నుండి తీసివేయుట. ఒకడు క్రీస్తు సంఘము అనెడి దేవుని కుటుంబములో యున్నచో అతడు నమ్మకముగా యుండవచ్చును. కాని ఒకడు మత సంబంధమైన తప్పిదములో యుండి నమ్మకముగా యుండలేదు.

బైబిలు మాత్రమే మనము పరలోకమునకు పోవుటకు మార్గదర్శి. మరియు దానినుండి మనము దేనినైనను తీసివేసిన ఎడల మనము ఘోర పాపము చేసినవారమగుదుము. పౌలు నమ్మకస్తుడు, నిజాయితీపరుడు మరియు క్రీస్తును క్రీస్తు సంఘమును విడవక బాధించునపుడు అతడు సరియైన వాడనని తలంచెను. కాని అతడు పాపము చేసెను (అపొ. 22:3,4; 23:1, 26:9-11). పౌలు తప్పిదము చేసితినని గ్రహించినపుడు అతడు ఆ తప్పును విడిచి పెట్టెను.

దేవుడు చేయకూడదని చెప్పిన కార్యములను చేయుట వలన మానవుడు పాపము చేసియున్నాడు. పాపము చేయు ప్రతీవాడును ఆజ్ఞను అతిక్రమించును ఆజ్ఞాతిక్రమమే పాపము (1 యోహా. 3:4). దేవుని యొక్క ఏ ఆజ్ఞను అతిక్రమించినను అది పాపమే. దీనిని విశ్వసించే వారిలో చాలమంది బైబిలు పాపము విషయమై ఇంకను ఏమి బోధించుచున్నదో దానిని మరచిన వారుగా కనబడుచుందురు. దేవుడు ఏమి కోరుచున్నాడో దానిని చేయకుండుట వల్ల అతడు పాపము చేయుచున్నాడు. "కాబట్టి మేలైనది చేయనెరిగియు అలాగు చేయనివానికి పాపము కలుగును (యాకోబు 4:17).

యేసు దేవుని కుమారుడని విశ్వసించుమని బైబిలు బోధించుచున్నది. అది మానవులను వారి పాపముల విషయమై మారుమనస్సు పొందుమని బోధించుచున్నది. మరియు విశ్వాసముంచుమ ఒప్పుకొనుము క్రీస్తులోనికి పాపముల క్షమాపణ నిమిత్తము బాప్తీస్మము పొందుమని బోధించు చున్నది (యోహా 8:24, అపొ 2:38, 8:35-39, 17:30). ఆ విధముగా సువార్తను అంగీకరించినపుడు వారు క్రీస్తు సంఘసభ్యులగుదురు. ఇదంతయు బైబిలులో చదువగలము. మానవుడు ఎంత మంచి వాడయినప్పటికి ఏమి పరావాలేదు గాని అతడు దేవుడు చెప్పినట్లుగా చేయలేకపోతే అతడు పాపము చేయును.

"ఏలయనగా పాపము వలన వచ్చు జీతము మరణము అయితే దేవుని కృపావరము మన ప్రభువైన క్రీస్తు యేసునందు నిత్యజీవము" (రోమా 6:23).

— జోసెఫ్ ఓవర్టన్ (Vot)


## మీ సంఘమునకు ఒక మంచి అవకాశము !!

మీ స్థానిక సంఘములో చదువుకొన్న వారందరి దగ్గరా బైబిలు వున్నాదా? లేకపోయినచో వారందరికీ బైబిళ్లను మేము ఉచితముగా ఇయ్యగలము. వారిని **బేసిక్ బైబిలు కోర్సులో** చేర్పించండి. దానిలో 28 పాఠములను పూర్తి చేస్తే వెంటనే బైబిలు ప్రతిని ఉచితంగా వారికి అందజేస్తాము. వారి అడ్రసులను వారి అనుమతితోనే దిగువ చిరునామాకు పంపండి :

**SATYA VANI**
P.o. Box. 80, Kakinada - 533 001.

## Declaration (See Rule 3)

| | | |
|---|---|---|
| Title of the News Paper | : | **SATYA VAKKU** |
| Language | : | Telugu |
| Name & Address of the Publisher | : | Joshua Gootam<br>10-4-33/1, S.G. Rao St,<br>Kakinada - 533 004. |
| Nationality | : | Indian |
| Name of the Printer with address | : | Joshua Gootam,<br>10-4-33/1, S.G. Rao St,<br>Kakinada - 533 004. |
| Place of Printing with address | : | Satyavani<br>Church of Christ, 7-9-35,<br>Sambamurthi St.,<br>Kakinada - 533 001. |
| Place of Publishing | : | Satyavani<br>Church of Christ, 7-9-35,<br>Sambamurthi St.,<br>Kakinada - 533 001. |
| Name of the Editor | : | Joshua Gootam (Indian)<br>10-4-33/1, Seshagirirao St,<br>Kakinada - 533 044. |

I, Joshua Gootam declare that particulars in respect of the News paper above are true to the best of my knowledge and belief.

Sd/-

Joshua Gootam

దేవుని తెలిసికొనులాగున, చూచులాగున, తాకులాగున, దేవుడే తన్నుతాను సంకుచితము చేసికొని క్రీస్తు రూపమున మనమధ్య నివసించెను. అందువలన ఆయన శరీరరూపము దాల్చినపుడు దేవత్వము యొక్క సర్వపరిపూర్ణత ఆయన యందు నివసించుచుండెను. ఆయన సృష్టికర్త గాని సృజింపబడినవాడు కాడు, ఆయన దేవదూతకాదు గాని దేవుని కూమారుడని మనం విశ్వసింపవలెను. అట్లు నమ్మనివాడు అపవాది సంబంధి (1 యోహాను 4:2). సోదరులు డేవిడ్ కింగ్ మరియు శ్రీనివాస్ గోగుల్‌జీ గార్లు అధ్యక్షులుగా ఆ సమావేశమునందు వ్యవహరించిరి. కరక్కాయపేట క్రీస్తు సంఘ సువార్తికులు వి. రాజకుమార్ గారు, స్థానిక సంఘము హాజరైన వారందరికీ చక్కటి ఆతిధ్యమిచ్చిరి. జాషువా గారి ప్రార్థనతో నాటి సమావేశము ఆనందదాయకముగా ముగిసెను.

ఫిబ్రవరి 26వ తేదీ మంగళవారం పెద్దాపురం మండలం చదలాడ గ్రామములో క్రీస్తుసంఘ ఆవరణలో ఒకరోజు బైబిలుక్లాసు జరిగెను. దానిలో "సంఘములో స్త్రీ యొక్క పాత్ర" అను అంశమును జాషువాగూటం గారు సవిస్తరముగా బోధించిరి. చదలాడ,గోరింట,పులిమేరు గ్రామములలో సోదరులు యమ్. ప్రేమ్ కుమార్ గారు వాక్యపరిచర్య చేయుచున్నారు.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02/2002

**From:**

**SATYA VAKKU**
**P.O. BOX 80,**
**KAKINADA - 533 001**

**To**

Edited & Published and Owned by Joshua Gootam & Published at Satya Vani Church of Christ & Printed by him at Satya Vani Publications, Sambhamurthy St., KAKINADA - 533 004. Editor : JOSHUA GOOTAM.